క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కార్వేటినగరం: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ పి.స్వరూప తెలిపారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ భౌతిక శాస్త్రం బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఎంఎస్సీ ఫిజిక్స్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు విద్యాసామగ్రి ఇస్తున్న చంద్రయ్య

విజయపురం (నగరి): మండలంలోని గంగమాంబపురం ఉన్నత పాఠశాల 9, 10వ తరగతుల విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రయ్య పరీక్షల ప్యాడ్, జామింట్రీ బాక్స్‌తో పాటు పెన్నులు, పెన్సిళ్లు, ఇంగ్లీష్ రాతపుస్తకాలను అందజేశారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్య పోటీల్లో విజేతలకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వెదురుకుప్పం: తిరుపతిలోని విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా వేమన పద్యాల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల పాఠశాల స్థాయిలో నిర్వహించిన వేమన పద్యాల పోటీల్లో వెదురుకుప్పం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి సుదర్శన్, ఏడవ తరగతి విద్యార్థి జెమీమా విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. వీరికి ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందుకోవడంతో వారిని అభినందించారు.

ఆటో డ్రైవర్లకు లైసెన్సు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్

పెనుమూరు(కార్వేటినగరం): ఆటో డ్రైవర్లకు వాహన రికార్డులతోపాటు, డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరని ఎస్‌ఐ అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్లకు బుధవారం రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు యూనిఫామ్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఆదేశించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించిన కఠిన చర్యలతో పాటు అత్యధికంగా జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

శ్రీరంగరాజపురం: జిల్లా కేంద్రంలో తలపెట్టిన సామాజిక సాధికారత యాత్రను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణి పిలుపునిచ్చారు. ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ రాష్ట్ర మంత్రులు బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, జనార్దన్, దామునాయుడు, హరిరెడ్డి, బాలకృష్ణయాదవ్, హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పరేడ్‌కు జ్యోతి



చిత్తూరు కలెక్టరేట్: ఢిల్లీలో జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవం పరేడ్‌కు సావిత్రమ్మ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైందని ఆ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షమ్స్ అక్తర్ వెల్లడించారు. ఈ మేరకు ఆమె బుధవారం మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న 35 మంది విద్యార్థులు పరేడ్‌లో పాల్గొంటారన్నారు. ఈ పరేడ్‌కు తమ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జ్యోతి ఎంపికవడం హర్షణీయమన్నారు.

82 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో బుధవారం వేకువజాము నుంచే సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. సాయంత్రానికి 82 శాతం పూర్తయిందని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ దస్తగిరి



నగరి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ



సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కార్వేటినగరం: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఎస్‌ఐ దస్తగిరి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. దీనికి హాజరైన ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థుల వ్యక్తిగత వివరాలను ఇతరులకు తెలియకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలని సైబర్ నేరాలకు పాల్పడుతుంటారని, అలాంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ మునికృష్ణ, అధ్యాపకులు డాక్టర్ ధనంజయులురెడ్డి పాల్గొన్నారు.

నగరిలో..

నగరి : అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని సీఐ సురేష్ అన్నారు. సైబర్ జాగృత దివస్‌లో భాగంగా బుధవారం స్థానిక సూర్య జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం సీఐ నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలు, కంప్యూటర్ ఆధారిత నేరాలు, ఏఈపీఎస్ ఆధార్ మోసాల గురించి వివరించారు. చిన్న పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు ఈ సైబర్ క్రైమ్‌లో చిక్కుకుంటున్నారన్నారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని కొందరు ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని, నేరగాళ్లు ఎక్కువగా యువతను టార్గెట్‌గా చేసుకుంటున్నారన్నారు. సైబర్ నేరాలను ఎలా గుర్తించాలి? నేరగాళ్ల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? వాటి బారిన పడి మోసపోతే ఎవరిని సంప్రదించాలో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు చేయడానికి హెల్ప్‌లైన్ నంబరు 1930, 100 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసులు, పోలీసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వెదురుకుప్పం: మాట్లాడుతున్న ఏఎస్‌ఐ సుబ్రమణ్యం

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: సైబర్ నేరాలపై అవగాహన అవసరమని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వెదురుకుప్పం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏఎస్‌ఐ సుబ్రమణ్యం నాయుడు మాట్లాడుతూ సైబర్ మోసాల బారిన పడి ఎలా బలైపోతున్నారో వివరించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారాలు ఎలాంటి వాటిని షేర్ చేయాలో ఎలాంటి వాటిని షేర్ చేయకూడదో గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వేణు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వెంకటేష్, సైబర్ క్రైమ్స్ కో–ఆర్డినేటర్ ఇస్మాయిల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

పాలసముద్రం : మండలం కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలో ఉన్న తొమ్మిది గ్రామ సచివాలయల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఈ శిబిరాల ద్వారా 4,980 మంది వైద్య సేవలు పొందారు. మండలంలో కంటి ఆపరేషన్ల కోసం 68 మంది. న్యూరాలజీ సమస్యలు ఉన్న 109 మంది ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న 77 మందిని తిరుపతి, నెల్లూరు ప్రాంతాల్లోని ఆస్పత్రులకు రెఫర్ చేశారు. గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న మహిళలను శస్త్రచికిత్స కోసం పెద్ద ఆస్పత్రులకు తరలించేందుకు చర్యలు చేపట్టారు.

నెల రోజుల ముందు నుంచే సర్వే

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామ వలంటీర్లు నెల రోజుల ముందు నుంచే ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. మండలంలోని 5,300 గృహాలు ఉండగా 5,100 గృహాలను సందర్శించి వారి ఆరోగ్య స్థితిగతులు తెలుకున్నారు. అనారోగ్యంతో ఉన్న వారికి రశీదులు అందజేసి, వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకున్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ పంపిణీ

నగరి : పెన్షన్‌దారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా వారిని వెతుక్కుంటూ వెళ్లి పెన్షన్ అందించే సుపరిపాలన రాష్ట్రంలో నడుస్తోంది. మండలంలోని బుగ్గఅగ్రహారానికి చెందిన పి.సుధాకర్ (67) గుండె సంబంధిత వ్యాధితో తీవ్ర అస్వస్థతకు గురై తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పుట్టుకతో మూగ, చెవుడు ఉన్న ఆయన పెన్షన్‌దారుడు కావడంతో అతనికి పెన్షన్ అవసరాన్ని గుర్తించిన వెల్ఫేర్ అసిస్టెంట్ నిసార్ అహ్మద్ బుధవారం తిరుపతికి వెళ్లి ఆస్పత్రిలోనే పెన్షన్ అందజేశాడు. అతడిని పలువురు అభినందించారు.



పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలకు పుత్తూరు విద్యార్థి



ధనుష్‌ను అభినందిస్తున్న ఎంఈఓ తిరుమలరాజు

పుత్తూరు రూరల్: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.ధనుష్ ఎంపికయ్యాడని ఎంఈఓ తిరుమలరాజు తెలిపారు. బుధవారం పాఠశాలలో ధనుష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. ఎంఈఓ మాట్లాడుతూ, పలమనేరులో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అండర్–17 విభాగంలో ధనుష్ ప్రతిభ కనబరచి రాష్ట్ర జట్టుకు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సునీత, ఫిజికల్ డైరెక్టర్ అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల భవనంలో మినీ గ్రంథాలయం





మినీ గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ బాలసుబ్రమణ్యం, క్యారంబోర్డు ఆడుతున్న విశ్రాంత ఉద్యోగులు

పుత్తూరు రూరల్: పుత్తూరులోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం మినీ గ్రంథాలయంతో పాటు ఇండోర్ క్రీడలను ఎంఈఓ బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగులతో పాటు యువతకు విజ్ఞానం, వినోదం అందించడానికి వివిధ పుస్తకాలను, ఇండోర్ క్రీడలను అందుబాటులోకి తేవడం హర్షణీయమన్నారు. ఇకపై ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ దినపత్రికలతో పాటు, పుస్తకాలు చదువుకోవచ్చని, క్యారమ్స్, చెస్ ఆడవచ్చన్నారు. దీనిని విశ్రాంత ఉద్యోగులతో పాటు యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగి అరుణాచలంరెడ్డి 150 ఆధ్యాత్మిక పుస్తకాలను మినీ గ్రంథాలయానికి వితరణ చేశారని, మరో విశ్రాంత ఉద్యోగి రమేష్ రెండు చెస్, రెండు క్యారమ్ బోర్డులను వితరణగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కృపావరమ్మ, నిర్మలమ్మ, చంద్రశేఖర్ వర్మ, రామచంద్రరాజు, కుప్పయ్య, అరుణాచలంరెడ్డి, రామలింగం, బాలసుబ్రమణ్యం, మురళిఆచ్చారి తదితరులు పాల్గొన్నారు.

సప్తకనికలమ్మ సేవలో మంత్రి

చిత్తూరు రూరల్: నగరంలోని దొడ్డిపల్లిలో ఉన్న శ్రీసప్తకనికలమ్మను బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఆల య అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారి దీపం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి తదితరులు ఉన్నారు.



అమ్మవారి సేవలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చెరువుల ఆక్రమణపై చర్యలు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో చెరువులు ఆక్రమణలకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ అరుణ నగర ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. చిత్తూరులోని గంగినేని చెరువు ప్రాంతాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. దుర్గానగర్ కాలనీ చెరువు, కట్టమంచి చెరువు, బుడమాల చెరువులో ఆక్రమణలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు.

బస్సు యాత్రను జయప్రదం చేద్దాం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో నిర్వహించే సామాజిక సాధికారత బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆయన బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత 4.5 సంవత్సరాలుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చేసిన మేలును యాత్రలో తెలియజేస్తామన్నారు. గతంలో ఎవరూ చేయని మేలును జగనన్న ఆయా సామాజిక వర్గాలకు చేశారన్నారు. బస్సు యాత్ర గురువారం చిత్తూరు నగరంలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు. స్థానిక కట్టమంచిలో యాత్ర మధ్యాహ్నం ప్రారంభమై నాగయ్య కళాక్షేత్రం వద్ద బహిరంగ సభకు చేరుకుని రాత్రి ముగుస్తుందన్నారు. దీనికి డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, అంజాద్‌బాషా, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజ్యసభ ఎంపీ బీద మస్తాన్‌రావు, విజయనగరం ఎంపీ చంద్రశేఖర్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, పలువురు నామినేటెడ్ నాయకులు పాల్గొంటారని వివరించారు. సమావేశంలో నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కో–ఆప్షన్ మెంబర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యాత్ర సాగుతుందిలా..

- ప్రజాప్రతినిధులు కట్టమంచి కల్యాణ మండపానికి మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం1–2 గంటలకు తటస్తులు, ప్రభావవంతులతో మండపంలో సమావేశం అవుతారు.
- మధ్యాహ్నం 2–2.30 గంటలకు వారితో కలిసి అక్కడ భోజనం చేస్తారు.
- మధ్యాహ్నం 2.30–2.45 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నారు.
- మధ్యాహ్నం3–3.30 గంటలకు అక్కడి నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుంది.
- మధ్యాహ్నం 3.45 గంటలకు బస్సు యాత్ర నాగయ్య కళాక్షేత్రం వద్దకు చేరుకుంటుంది.
- సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభలో వక్తలు ప్రసంగించనున్నారు.

'అమరజీవి'కి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

–ఘనంగా రాష్ట్రావతరణ దినోత్సవం

నగరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రాష్ట్రావతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ లీలామాధవి మాట్లాడారు. రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కీర్తించారు. ఆయన త్యాగంతోనే రాష్ట్రం అవతరించిందని, ఆయన జీవితం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణవేణి, ఏపీఓ కవిత, వైస్ ఎంపీపీ కన్నియప్ప, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, నాయకులు గుణశేఖర్ రెడ్డి, మధు, మోహన్, జగదీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం చొరవతోనే ఆలయాలకు మహర్దశ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

గంగాధరనెల్లూరు : నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతోనే దేవాలయాలకు మహర్దశ వచ్చిందని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. మండల పరిషత్ చాంబర్లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత డిప్యూటీ సీఎం నారాయణస్వామికే దక్కిందన్నారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి గడపలోని సమస్యలు తెలుసుకొని పరిష్కరించారని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాలను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఆయన ప్రత్యేక చొరవతో వందల కోట్లు తీసుకువచ్చిన ఘనత ఆయనదేనన్నారు. టీటీడీ అనుసంధానంతో ఒక్కొక్క ఆలయానికి రూ.10 లక్షలతో నియోజకవర్గంలోని 150 ఆలయ నిర్మాణాలకు మంజూరు చేయించారన్నారని గుర్తుచేశారు. మండలంలో దాదాపు 60 దేవాలయాల పునర్నిర్మాణానికి, దాదాపు 100 దేవాలయాలకు ధూపదీప నైవేద్యాలకి ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మురుగునీటి సమస్య ఉన్న ప్రతి గ్రామాన్ని గుర్తించి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు మంజూరుకు సిఫార్సు చేశారన్నారు. అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై కొంతమంది నాయకులు విమర్శించడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో జిల్లా రైతు అధ్యక్షులు వెంకటరెడ్డి, ఏపీ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమ్మ రెడ్డి, మండల రైతు భరోసా కేంద్రాల అడ్వైజరీ కమిటీ చైర్మన్ బలరామ రెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, జిల్లా రైతు అధ్యక్షులు వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నమ రెడ్డి, మండల ఆర్‌బీకే అడ్వైజరీ కమిటీ చైర్మన్ బలరామ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేలు మొదలి, ఎంపీటీసీ సభ్యులు గోవిందరెడ్డి, వెంకటేశు రెడ్డి, సర్పంచ్ హరి ప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్ వరద రాజుల రెడ్డి, మండల సీనియర్ నాయకులు కేశవరెడ్డి, శంకర్ మొదలి తదితరులు పాల్గొన్నారు.

ట్యాలీ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు రూరల్: ఆధునిక ప్రపంచంలో ఉత్పత్తి, సేవా రంగాలలో వ్యాపారాభివృద్ధికి ట్యాలీ కోర్సు ఎంతో కీలకమని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం కామర్స్ విభాగంలో ఆయన ట్యాలీ కోర్సును ప్రారంభించి మాట్లాడారు. ట్యాలీ సర్టిఫికెట్ కోర్సు వల్ల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ కోర్సుల్లో సమాచారంలో వాస్తవికత, అధిక సమాచారాన్ని సక్రమంగా మదింపు చేయడం, మూల్యాంకనంలో మానవ తప్పిదాలను నివారించడం, వ్యాపారాన్ని సులభతరం చేయడం వంటి ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్నారు. కోర్సు ప్రాధాన్యత, డిమాండ్‌ను వివరించారు. కార్యక్రమంలో కోర్సు సమన్వయకర్త డాక్టర్ జి.తిరుమలయ్య, అధ్యాపకులు దేవకి, వాసవి, గంగయ్య, శ్రీనివాసులు, నాగరాజు, లక్ష్మీబాయి, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ప్రతి బుధవారం ఇక్కడ ఈ వితరణ చేస్తుండటం విదితమే. గర్భిణులు మాట్లాడుతూ ప్రతి బుధవారం కడుపు నిండా మంచి భోజనం పెడుతున్న మంత్రి రోజమ్మ రోజు మేలు మరువలేమన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రకాష్, ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నారాయణస్వామి, పుష్పమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

వినాయకుని సన్నిధిలో ప్రముఖులు





ఆలయంలో ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, ఎమ్మెల్సీ పద్మశ్రీకి స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని పలువురు ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తన మిత్ర బృందంతో, సాయంత్రం కాకినాడ ఎమ్మెల్సీ పద్మశ్రీ తన కుటుంబ సభ్యులతో కలసి వేర్వేరుగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. వారికి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందించారు.

కిక్కిరిసిన కాణిపాకం

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కంపార్ట్‌మెంట్లు, రూ.150, రూ.100 క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని చిత్తూరుకు చెందిన రవికుమార్ ఆలయ అధికారులకు ఇచ్చారు.